క్లుప్తంగా...

డీఆర్‌ఓగా బాధ్యతలు స్వీకరించిన హరిప్రియ



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్‌వో)గా జేఎల్వీ హరిప్రియ గురువారం బాధ్యతలు స్వీకరించారు. మేడ్చల్ జిల్లాలో డీఆర్‌వోగా పనిచేసిన లింగ్యానాయక్ (ఎస్‌డీసీ భూసేకరణ) ఇటీవల వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్‌గా పదోన్నతిపై వెళ్లారు. కొత్తగా డీఆర్‌ఓగా బాధ్యతలు తీసుకున్న హరిప్రియను పలువురు జిల్లా అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్‌గా సాబేర్ అలీ



బాధ్యత స్వీకరిస్తున్న సాబేర్ అలీ

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపల్ నూతన కమిషనర్‌గా సాబేర్ అలీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన వేమనరెడ్డి పోచారం మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. తుర్కయాంజాల్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన సాబేర్ అలీ ఘట్‌కేసర్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా నూతన కమిషనర్ సాబేర్ అలీ మాట్లాడుతూ మున్సిపాలిటీ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, మున్సిపాలిటీ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు.

బాధ్యతల్లో దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్



కమిషనర్‌ను సత్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్‌గా ఎస్.రాజమల్లయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్, వైస్‌చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు కొత్త కమిషనర్ రాజమల్లయ్యను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ రాజమల్లయ్య మాట్లాడుతూ అందరి సహకారంతో దమ్మాయిగూడ మున్సిపల్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. డీఈఈ చిరంజీవులు, మేనేజర్ వెంకటేశం, శానిటరి ఇన్‌స్పెక్టర్ ప్రభు, కౌన్సిలర్లు వెంకటేష్, రమేష్‌గౌడ్, శ్రీహరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అత్యవసరమైతేనే బయటకు రావాలి

మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్



ఘట్‌కేసర్: అత్యవసర పనులుంటే తప్ప ఇంట్లో నుంచి బయటకు రావొద్దని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్ అన్నారు. పట్టణంలో గురువారం ఆమె మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యుత్ కేబుళ్లు, ఇంట్లో తడిసిన చేతులతో స్విచ్‌లను తాకొద్దని, పురాతన భవనాల్లో, చెట్ల కింద ఉండొద్దన్నారు. చిన్నారులు, వృద్ధులు బయటకు రాకుండా చూసుకోవాలన్నారు. మున్సిపల్ కార్మికులు, కార్యాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అత్యవసరమైతే మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రూ.10 కోట్లతో బ్రిడ్జి నిర్మించడం అభినందనీయం

మల్లాపూర్: మల్లాపూర్ పారిశ్రామికవాడ నుంచి నాచారం పారిశ్రామికవాడకు వెళ్లే దారిలో సామాజిక బాధ్యతతో అరెంజన్ లైఫ్ సైన్సెస్ వారు రూ.10 కోట్లతో బ్రిడ్జిని నిర్మించడం అభినందనీయమని టీఎస్‌ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, ఎండీ ఈవీ నర్సింహారెడ్డి అన్నారు. గురువారం నాచారం పారిశ్రామికవాడలో రూ.1.50 కోట్లతో ఏర్పాటు చేసిన నాచారం రాక్ గార్డెన్ పార్క్, బ్రిడ్జిని అరెంజన్ లైఫ్‌సైన్సెస్ సీఈవో మన్ని కంటిపూడితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో టీఎస్‌ఐఐసీ జోనల్ మేనేజర్ మాధవి, మధుసూదన్, శ్యాంసుందర్, కమిషనర్ ఉమా మహేశ్వర్, డీఈ అంజయ్య, ఎలక్ట్రానిక్ డీజీఎం శిల్పా, మేనేజర్ పురేందర్, మల్లాపూర్ ఐలా చైర్మన్ మహేందర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, నాచారం ఐలా చైర్మన్ మహిపాల్‌రెడ్డి, కార్యదర్శి బాలరాజ్, అసోసియేషన్ అధ్యక్షుడు కరణ్‌రెడ్డి, వైస్ చైర్మన్ భూషణ్‌రావు, ఉప కార్యదర్శి హుస్సేనయ్య తదితరులు ఉన్నారు.

మూడ్రోజులు.. ఆగమాగం..



ఘట్‌కేసర్ సాయినగర్ కాలనీలో..

మూడ్రోజులుగా ఆగకుండా వర్షం కురుస్తుండటంతో ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు.. కొన్ని కాలనీల్లో ఎటుచూసినా వరద నీరే కనిపించింది. రోడ్లు గోదారులయ్యాయి. వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణించారు. ద్విచక్రవాహనదారులైతే ఎక్కడ ఏ గుంతలో పడతామోననే భయంతో ప్రయాణాలు సాగించారు. నాలాలు ఉప్పొంగి ప్రవహించడంతో పరివాహక ప్రాంతాల ప్రజలు భయాందోళన చెందారు. పలుచోట్ల ఇళ్లలోకి నీరు చేరింది. పలుచోట్ల చెట్లకొమ్మలు విరిగి వైర్లపై పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొన్ని ప్రధాన రహదారులు చెరువులను తలపించాయి. దీంతో వాహనాలు ముందుకు కదలలేక ట్రాఫిక్ జామ్ అయ్యింది. మాన్‌సూన్ సిబ్బంది ఎప్పటికప్పుడు వరద సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టారు.



నాగారం మున్సిపాలిటీలోని బీఎంఆర్ ఎన్‌క్లేవ్ కాలనీలో..



మేడ్చల్‌లో డ్రైనేజీలను శుభ్రం చేయిస్తున్న కౌన్సిలర్లు హరికృష్ణయాదవ్, ఉమానాగరాజు



రాంపల్లి చౌరస్తా వద్ద వరద సాఫీగా వెళ్లే విధంగా పనులు చేయిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి



వరంగల్ జాతీయ రహదారి చెంగిచెర్ల క్రాస్‌రోడ్డు వద్ద దుస్థితి



మూడుచింతలపల్లి-పోతారం చౌరస్తా వద్ద..

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- భారీ వర్షాలతో కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్
- అవసరమైతే ఫోన్ నంబర్: 9492409781
- జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్



సాక్షి, మేడ్చల్ జిల్లా: రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలోని అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ అన్నారు. భారీ వర్షాల కారణంగా రెడ్ అలర్ట్ ప్రకటించినందున జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు, చెరువులు, నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే నీటి ప్రవాహం ఉన్న వంతెనలు, రోడ్ల వద్ద ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. జిల్లాలోని గ్రామస్థాయి అధికారులు అందుబాటులో ఉంటూ ప్రజలకు ఏమైనా ఇబ్బంది కలిగితే వెంటనే సంబంధిత మండల స్థాయి అధికారులు, జిల్లా స్థాయి అధికారులకు తెలియజేయాలన్నారు. శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లలో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. వర్షాల వల్ల ప్రజలకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు, కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 9492409781లో సంప్రదించాలని ఆయన సూచించారు. జిల్లా వ్యాప్తంగా జిల్లాస్థాయి అధికారులు, ఆర్డీవోలు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రస్తుతం సిబ్బంది 24 గంటల పాటు అందుబాటులో ఉంటారని తెలిపారు.

పూడూర్ గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న పూడూర్ సర్పంచ్, నాయకులు

మేడ్చల్‌రూరల్: మండలంలోని పూడూర్ గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించాలని గ్రామ సర్పంచ్ బాబుయాదవ్, పాలకవర్గ సభ్యులు మంత్రి మల్లారెడ్డికి వినతిపత్రం అందజేశారు. గురువారం మంత్రి నివాసంలో మంత్రి మల్లారెడ్డి, బీఆర్‌ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డిని కలిసి గ్రామంలో సీసీ రోడ్లు, వీధిదీపాలు, వ్యాయామశాల, దేవాలయ, కులసంఘాల భవన నిర్మాణాలను నిధులు కేటాయించాలని కోరగా సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలో గ్రామంలో పర్యటించి గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో ఉపసర్పంచ్ మానేపల్లి వెంకటేష్, వార్డు సభ్యులు శశికుమార్‌యాదవ్, శ్రీకాంత్, మాజీ బీఆర్‌ఎస్ అధ్యక్షులు శంకర్, నాయకులు నాగేశ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి మల్లారెడ్డిని కలిసిన అంకిరెడ్డిపల్లి బీఆర్‌ఎస్‌నేతలు

కీసర: మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామంలోని వివిధ వార్డుల్లో డ్రైనేజీ, సీసీరోడ్లు, గ్రామంలోని దేవాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ గురువారం బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సింగారం నారాయణ, ఉపసర్పంచ్ కొల్కూరి మహేష్, వార్డు సభ్యులు నగేష్, ఇస్తారి, బాల్‌రాజ్, లింగేశ్వర్ తదితరులు మంత్రిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. నేతలు పవన్, బాలు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి మల్లారెడ్డిని కలిసిన అంకిరెడ్డిపల్లి ఉపసర్పంచ్ తదితరులు

మున్సిపల్ పాలనలో కండ్లకోయ అభివృద్ధి శూన్యం



కండ్లకోయలో బురదమయంగా మారిన రోడ్లు



అధ్వానంగా మారిన డ్రైనేజీ వవస్థను చూపుతున్న మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి

కండ్లకోయ మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి

మేడ్చల్‌రూరల్: గతంలో ఉత్తమ గ్రామ పంచాయతీగా అవార్డులు అందుకున్న కండ్లకోయ గ్రామం నేడు మున్సిపల్‌లో కలవడంతో సమస్యల కూపంగా మారిందని మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సర్పంచులు చేసిన అభివృద్ధే తప్ప ప్రస్తుత పాలకులు కొత్తగా అభివృద్ధి చేసిందేమీ లేదన్నారు. గ్రామంలో డ్రైనేజీ పనులు చేపట్టేందుకు తవ్వకాలు చేపట్టి పూడ్చకపోవడంతో చిన్నపాటి వర్షానికి రోడ్లన్నీ బురద, చెరువులుగా మారుతున్నాయన్నారు. డ్రైనేజీలు పొంగి పారుతున్నాయని, గ్రామమంతా బురదమయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి ఇద్దరు ప్రజాప్రతినిధులు ఉన్నా సమస్యలు మాత్రం ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్నట్లు తయారైందని ఆరోపించారు.

28న పాలీసెట్ స్పాట్ కౌన్సెలింగ్

రామంతాపూర్: పాలిటెక్నిక్ ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సుల ప్రవేశాలకు ఈ నెల 28న స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ వినయ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలీసెట్ ఎంట్రన్స్‌లో అర్హత సాధించిన వారు టెన్త్ ఉత్తీర్ణులైన వారు ఈనెల 25 నుంచి 27 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. పాలీసెట్ ఎంట్రన్స్‌లో అర్హత సాధించిన వారికి అడ్మిషన్లలో మొదటి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.

మహిళ అదృశ్యం



అరుణ(ఫైల్)

జవహర్‌నగర్: మహిళ అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కౌకూర్ రాజీవ్ గృహకల్పలో నివసించే జమ్మన్న సెంట్రింగ్ పని చేస్తుంటాడు. భార్య అరుణ(22), ఇద్దరు పిల్లలతో ఉంటున్నారు. అరుణ తరచూ ఫోన్‌లో మాట్లాడుతుండగా భర్త జమ్మన్న గమనించి మందలించాడు. బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అరుణ తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆమె ఆచూకీ కోసం తెలిసిన చోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాధ్యతలు చేపట్టిన ఉప్పల్ సర్కిల్ డీసీ శ్రీనివాస్

ఉప్పల్: బదిలీపై వచ్చిన ఉప్పల్ సర్కిల్ డీసీ బి.శ్రీనివాస్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది, కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ఆయనను శాలువాతో సత్కరించారు. అదేవిధంగా ఇక్కడ పనిచేసిన డీసీ అరుణ కుమారికి వీడ్కోలు పలుకుతూ సిబ్బంది శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడుతూ మూడేళ్లలో ఉప్పల్ ప్రజల ఎంతగానో ఆదరించారని సంతోషం వ్యక్తం చేశారు. జీహెచ్‌ఎంసి సిబ్బంది, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా తరుణ్‌గౌడ్

బోడుప్పల్: బోడుప్పల్‌కు చెందిన పొన్నం తరుణ్‌గౌడ్ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర అధ్యక్షుడు కొత్తకాపు శివసేనా రెడ్డి చేతులమీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించి పదవి రావడం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీకి తనవంతు కృషి చేస్తానన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



మల్లాపూర్: భారీ వర్షం కురుస్తున్న నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ అధికారులు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి సూచించారు. గురువారం మల్లాపూర్ వార్డు కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ ఏఈ స్రవంతి, శానిటేషన్ అధికారి దాస్‌తో వర్షంపై మాట్లాడారు. వర్షం నీరు నిలువకుండా వాటర్ స్టాగ్ పాయింట్లను గుర్తించి చర్యలు తీసుకోవాలని, చెత్తపేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రాష్ట్రంలో నియంతృత్వ పాలన



ఘట్‌కేసర్ పీఎస్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ప్రవీణ్‌రావు, శోభారాణి

ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, బీజేపీ నేత ప్రవీణ్‌రావు



కీసరలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నేతలు

ఘట్‌కేసర్: తెలంగాణలో నియంతృత్వ పాలన సాగుతోందని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రావు అన్నారు. బాటసింగారంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పరిశీలకు వెళ్లకుండా బీజేపీ నాయకులను ముందస్తు అరెస్ట్ చేసి ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 2.65 లక్షల ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం నిధులు అందజేసిందని, బీజేపీకి మంచి పేరు వస్తుందనే ఇళ్లను నిర్మించడం లేదని ఎద్దేవా చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శోభారాణి, రవికాంత్‌రెడ్డి, రవిశంకర్, శ్రీశైలం, విక్రాంత్‌రెడ్డి, మశ్చేందర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ప్రభంజన్ పాల్గొన్నారు.

మేడ్చల్‌రూరల్: ఛలో బాటసింగారం కార్యక్రమానికి బీజేపీ పిలుపునివ్వడంతో మేడ్చల్‌లో బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. మున్సిపల్, మండలానికి చెందిన పలువురు బీజేపీ నాయకులను మేడ్చల్ పోలీసులు తెల్లవారుజామున అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అక్రమ అరెస్టులపై బీజేపీ శ్రేణులు మండిపడ్డారు. తమ పార్టీని చూసి బీఆర్‌ఎస్ భయపడి అక్రమ అరెస్టులకు పాల్పడుతోందన్నారు. అరెస్టయిన వారిలో బీజేపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ప్రేమ్‌దాస్, రాఘవరెడ్డి, వంశీ తదితరులు ఉన్నారు.

బీజేపీ నేతల హౌస్‌అరెస్ట్

శామీర్‌పేట్: బాటసింగారంలో డబుల్ ఇళ్ల పరిశీలనకు గురువారం వెళ్తామని బీజేపీ ప్రకటించడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. గురువారం నుంచే ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని బీజేపీ నాయకుల ఇళ్ల వద్ద పోలీసులు మోహరించారు.

సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

కీసర: బాటసింగారంలో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల సముదాయాలను పరిశీలించేందుకు వెళ్లిన కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం కిషన్‌రెడ్డిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేసినందుకు నిరసనగా గురువారం కీసర అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ నేతలు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. మేడ్చల్ జిల్లా రూరల్ బీజేపీ ప్రధాన కార్యదర్శి జిల్లాల తిరుమల్‌రెడ్డి, భోగారం ఎంపీటీసీ సభ్యుడు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, బీజేపీ కీసర మండల అధ్యక్షుడు దేశం మల్లేష్‌గౌడ్, నేతలు అశోక్ ముదిరాజ్, ఐలయ్య, కృష్ణ, మహేందర్‌యాదవ్, పవన్‌గౌడ్, బండారు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్నాహక సభను విజయవంతం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గోవిందు నరేశ్

మేడ్చల్‌రూరల్: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలనే డిమాండ్‌తో వచ్చేనెల చివరి వారంలో ఎమ్మార్పీఎస్ నిర్వహిస్తున్న మాదిగల విశ్వరూప మహాసభ విజయవంతం చేయడంలో భాగంగా ఈ నెల 21లో ఘట్‌కేసర్‌లో నిర్వహిస్తున్న జిల్లా సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్ కోరారు. ఈ మేరకు గురువారం మేడ్చల్‌లోని అంబేడ్కర్ భవన్‌లో మండల అధ్యక్షుడు పరుశురాం ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేంత వరకు పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి రాంచందర్, జాతీయ ఉపాధ్యక్షుడు చిరంజీవి, నాయకులు బాలనర్సింహ, నర్సింగ్, శివకుమార్, నాగరాజు, స్వామి, రమేశ్‌బాబు, నరేందర్, ప్రభాకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య

నిందితులను రిమాండ్‌కు తరలించిన పోలీసులు

ఘట్‌కేసర్: ప్రియుడితో కలిసి భర్తను హత్యచేసిన వారిని ఘట్‌కేసర్ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. కోటగల్ల తుక్కప్ప(55) గతనెల 22వ తేదీన యంనంపేట్ చౌరస్తాలో అపస్మారక స్థితిలో ఉండగా గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యం సేవలు పొందుతూ 24వ తేదీన మృతి చెందాడు. ఈ మేరకు గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు కేసు నమోదు చేశారు. కాగా ఈ నెల 19న సంగారెడ్డి జిల్లా నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బొప్పారపు బాబు అనే వ్యక్తి మరి కొందరితో కలిసి తమకు తెలిసిన వ్యక్తి అదృశ్యమయ్యాడంటూ ఘట్‌కేసర్ పీఎస్‌లో వాకబు చేశాడు. గత నెల 24వ తేదీన మృతి చెందిన వ్యక్తి ఫొటోను వారికి చూపించగా సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన కోటగల్ల తుక్కప్ప(55)గా గుర్తించారు.

ఏడాదిగా వివాహేతర సంబంధం

మృతుడి రెండో భార్య కోటగల్ల ఈశ్వరమ్మ(40)కు సంగారెడ్డి జిల్లా వెంకటాపూర్‌కు చెందిన ముట్లకుంట శ్రీనివాస్‌తో ఏడాదిగా వివాహేతర సంబంధం కొనసాగుతోంది. ఈ విషయం తెలుసుకున్న తుక్కప్ప తన భార్యను పలుమార్లు హెచ్చరించాడు. దీంతో అతడిని అంతం చేయాలని ఈశ్వరమ్మ, శ్రీనివాస్ ప్లాన్ వేశారు. గతనెల 21న ఈశ్వరమ్మ, తుక్కప్ప వైద్యం కోసం సంగారెడ్డి బూదెరకు వచ్చారు. అక్కడ వీరికి శ్రీనివాస్ కలిశాడు. నగరంలో వైద్యుడు తనకు తెలుసంటూ శ్రీనివాస్‌తో పాటు వారిద్దరూ కొకూర్ దర్గాకు వచ్చారు.

క్రిమిసంహారక మందు కలిపి..

మెరుగైన వైద్యం కోసం ఘట్‌కేసర్‌కు వచ్చి బస్టాండ్‌లో తుక్కప్పను ఉంచి వైద్యుడి కోసం వచ్చారు. ప్రస్తుతం వైద్యుడు అందుబాటులో లేడని, మద్యం సేవిద్దామని ఒక బీరు, రెండు ఓసీ క్వార్టర్లు, ఒక క్రిమిసంహారక బాటిల్, ప్లాస్టిక్ గ్లాసులు తీసుకొని కాలినడకన యంనంపేట్ చౌరస్తా సమీపంలోని బహిరంగ ప్రదేశానికి చేరుకున్నారు. ఈశ్వరమ్మ, శ్రీనివాస్ మద్యంలో క్రిమిసంహారక మందును కలిపి తుక్కప్పతో తాగించారు. అపస్మారక స్థితిలోకి చేరుకోగానే అతడిని అక్కడే వదిలేసి స్వస్థలాలకు వెళ్లిపోయారు. ఇద్దరు నిందితులను యంనంపేట్ చౌరస్తాలో గురువారం ఉదయం అరెస్ట్ చేసి వారి నుంచి రెండు మొబైల్ ఫోన్లు, క్రిమిసంహారక బాటిల్, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. మర్డర్ కేసును ఛేదించిన ఘట్‌కేసర్ ఎస్సైలు అశోక్, ఇంద్రారెడ్డి, ఇతర సిబ్బందిని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ అభినందించారు.